క్లుప్తంగా

నిధులు మంజూరు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.1.70 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎంపీడీవో లింగం తెలిపారు. ఈ పనులకు సంబంధించి గ్రామ పంచాయతీ తీర్మానాలను సేకరిస్తున్నామని, పంచాయతీ పాలకవర్గం వీలైనంత త్వరగా తీర్మాన కాపీలను అప్పగించాలని పేర్కొన్నారు. తీర్మాన కాపీలు ఇచ్చిన వెంటనే పనులు చేపట్టాలని సూచించారు.

స్వర్గరథం వితరణ



సిరికొండ: మండలంలోని పందిమడుగు గ్రామ పంచాయతీ పరిధిలోని బాసునూతి తండాకు చెందిన ఎన్‌ఆర్‌ఐ పూల్‌సింగ్ గ్రామానికి స్వర్గరథం వితరణ చేశారు. ఆయన అమెరికాలో ఉండటంతో తల్లిదండ్రులు రూప్‌సింగ్, లక్ష్మిలను సర్పంచ్ సర్దాన్ భాగ్యలక్ష్మీ మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామానికి ఇంకా ఎలాంటి సౌకర్యాలు కావాలన్నా సమకూరుస్తానని ఎన్‌ఆర్‌ఐ పూల్‌సింగ్ హామీ ఇచ్చారని తెలిపారు. తాటిపల్లిలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలలో విజేతలుగా నిలిచిన నలుగురిని సన్మానించారు. ఉపసర్పంచ్ మోహన్, గోసంగి సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గంగనర్సయ్య, పంచాయతీ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో..



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నూతన రథం కోసం గ్రామానికి చెందిన బద్దం రాజశేఖర్‌రెడ్డి రూ.10 వేలు, తీగల హరీష్ రూ.10 వేలు విరాళం అందజేశారు. స్వర్గీయ వేముల సురేందర్‌రెడ్డి జ్ఞాపకార్థం గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బద్దం రాజేష్‌కు విరాళం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం స్వామి, నాయకులు సుంకరి మురళి, పెంట కిషన్, జైపాల్, రాజేందర్ పాల్గొన్నారు.

మిలిటరీ సార్‌కు నివాళి

బోధన్: బోధన్ ప్రాంత ప్రజలకు మిలిటరీ సార్, షిర్డి సాయిబాబా భక్తుడిగా సుపరిచితులైన పట్టణ కేంద్రానికి చెందిన మాజీ సైనికుడు ముప్పా వెంకట సుబ్బారావు(91) సోమవారం తెల్లవారు జామున తుది శ్వాస విడిచారు. గతంలో పాకిస్తాన్, చైనా దేశాలతో జరిగిన రెండు యుద్ధాల్లో సైనికుడిగా పోరాడారు. మంగళవారం పట్టణ కేంద్రంలో ఆయన అంత్యక్రియలు జరిగాయి. పలువురు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మాజీ సైనిక అధికారులు, ఉద్యోగులు శ్రీనివాసరావు, నాగ్‌నాథ్, రాజేష్, నాగరాజులు జాతీయ పతాకాన్ని దేహంపై కప్పి సైనిక వందనం చేశారు.

కలెక్టర్‌కు సన్మానం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌కు చెందిన సామాజిక సేవకుడు పట్వారీ తులసీ మంగళవారం జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణ రెడ్డిని సన్మానించారు. కలెక్టర్‌కు సంబంధించి 40 చిత్రాలతో కూడిన ఫోటో అల్బమ్‌ను తయారు చేసి అందజేశాడు. పట్వారీ తులసి సేవలు నేటి యువతరానికి ఆదర్శమని, ఫోటో గ్యాలరీ రూపకల్పనపై అభినందించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



మాక్లూర్: ఒడ్డేట్‌పల్లిలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చిత్రపటాలకు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బడుగు సత్యం ఆధ్వర్యంలో మంగళవారం గ్రామస్తులు క్షీరాభిషేకం చేశారు. ఒడ్డెటమ్మ దేవాలయం ప్రాంగణంలో కల్యాణమండపం నిర్మాణం కోసం సీఎం కేసీఆర్ రూ.20 లక్షలు మంజూరు చేయటం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు రామడోళ్ల రాజేశ్వర్, దేవాలయ కమిటీ చైర్మన్ గూండ్ల రవి, చింతల మోహన్, జనార్దన్ పాల్గొన్నారు.

నిర్మాణాన్ని అడ్డుకోవడం తగదు

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి వేంకటేశ్వర కాలనీలో చేపడుతున్న నిర్మాణ పనులను స్థానికులు అడ్డుకోవడం సైరనది కాదని బాధితుడు నర్సయ్య పేర్కొన్నారు. మున్సిపల్ అనుమతులతో తన షట్టర్ స్థలంలో నిర్మాణం చేపడుతున్నప్పటికీ స్థానికులు ఆటంకం కల్గిస్తున్నారని వాపోయారు. తాను దళితుడన్న కారణంతో కట్టడాన్ని నిలిపివేస్తున్నారని, అధికారులు స్పందించి ఆటంకం కల్గిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

కంటి వెలుగును వినియోగించుకోండి

- నిజామాబాద్ రూరల్ ఎంపీడీవో లింగం దిశానిర్దేశం
- ఏర్పాట్ల పరిశీలన



బీబీపూర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో గోపిబాబు



న్యాల్‌కల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో, సర్పంచ్, తదితరులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ నెల 19 నుంచి ప్రారంభమయ్యే కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో లింగం సూచించారు. మంగళవారం న్యాల్‌కల్, ముదక్‌పల్లి గ్రామాల్లో కంటి వెలుగు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 19న న్యాల్‌కల్, ముదక్‌పల్లి గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని, న్యాల్‌కల్‌లో 15 రోజులు, ముదక్‌పల్లిలో 10 రోజులు శిబిరం కొనసాగుతుందన్నారు. సిబ్బందికి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారని, 18 ఏళ్ల పైబడిన వారందరూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైన వారికి కంటి అద్దాలు, శస్త్ర చికిత్సలు చేస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచులు గంగాప్రసాద్, సుజాత, ఉపసర్పంచి సతీష్, ఎంపీవో ఇక్బాల్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

డిచ్‌పల్లి పరిధిలో..

డిచ్‌పల్లి: ధర్మారం(బి), గొల్లపల్లి, బీబీపూర్ గ్రామాల్లో 19న జరిగే రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంపీడీవో గోపిబాబు తెలిపారు. మంగళవారం ఆయా గ్రామాల్లో పర్యటించి కంటి వెలుగుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. కంటి వెలుగు పూర్తయ్యేంత వరకు గ్రామసభల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం కంటి వెలుగును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. గ్రామంలో అందరికి కంటి పరీక్షలు చేయించాలన్నారు. ఎంపీడీవో వెంట ఎంపీవో కిషన్‌రావు, నాగరాజు, ఇందల్వాయి మెడికల్ ఆఫీసర్ సంతోష్ కుమార్, ఆరోగ్య కార్యకర్త శంకర్, ఐకేపీ ఏపీఎం నాగరాజు, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలున్నారు.

జీవన భృతి కోసం ఆందోళన



జక్రాన్‌పల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న బీడీ కార్మికులు

జక్రాన్‌పల్లి: బీడీ కార్మికులందరికి ఎలాంటి ఆంక్షలు లేకుండా జీవన భృతి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీడీ కార్మికులు ఆందోళన చేపట్టారు. మంగళవారం జక్రాన్‌పల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బీడీ కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర నాయకుడు ముత్తెన్న మాట్లాడుతూ.. బీడీ కార్మికులకు కటాఫ్ డేట్ తొలగిస్తూ రాష్ట్ర కేబినెట్ తీర్మానం చేసినా ఇప్పటి వరకు పింఛన్లు మంజూరు చేయకపోవడం శోచనీయమని అన్నారు. రాష్ట్ర కేబినెట్ నిర్ణయాలకు అతీగతి లేకపోతే సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. బీడీ కార్మికులను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పకోకుండా వెంటనే జీవన భృతి అమలు చేయాలన్నారు. యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, నాయకులు కిషన్, మురళి, అరవింద్, మనోజ్, కవిత, లక్ష్మీ, సుమలత, సుకన్య, జ్యోతి, కృష్ణవేణి, రాజవ్వ, రాజమణి, సుభద్ర పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలని లేఖ



లేఖలను ప్రదర్శిస్తున్న సీపీఐ నేతలు

ఖలీల్‌వాడి: ప్రజల సమస్యలు పరిష్కరించాలని సీఎం కేసీఆర్‌కు సీపీఐ నేతలు బహిరంగ లేఖ రాశారు. నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడారు. రైతాంగానికి రూ.లక్ష రుణమాఫీ ఒకేసారి చేయాలని, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందివ్వాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు, కాంటాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని, దళితులకు మూడు ఎకరాల భూమి, పేదలకు భూ పంపిణీ చేయాలని, ఇళ్లు లేని వారికి డబుల్ బెడ్ రూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు తర్వాత ప్రకటించిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ నెల 18న ఖమ్మంలో జరిగే బీఆర్‌ఎస్ సభలో ఈ హామీలను నెరవేర్చే ప్రకటన చేయాలన్నారు. జిల్లా నాయకులు ఎండీ రఫిక్ ఖాన్, రఘురాం, అంజలి, అమర్ పాల్గొన్నారు.

పెన్షన్‌పై ఆదాయపు పన్ను అన్యాయం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు రామ్మోహన్‌రావు

నిజామాబాద్‌నాగారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో పనిచేసి రిటైర్‌అయిన వారికి ఆదాయపు పన్నులో మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రామ్మోహన్‌రావు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సంఘ కార్యాలయంలో రామ్మోహన్ రావు మాట్లాడుతూ.. రాబోయే బడ్జెట్ సమావేశంలో ఆ మేరకు మినహాయింపు ప్రతిపాదనను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కుటుంబం బ్రతకటానికి ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ పైన ఆదాయం పన్నును విధించటం అన్యాయమన్నారు. మధ్యతరగతి ఉద్యోగులకు ఆదాయపు పన్ను పరిమితిని పది లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. మధ్య తరగతి ఉద్యోగులకు ఈ బడ్జెట్లో సంతోషకరమైన వార్తలు ఉంటాయని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన నేపథ్యంలో ఈ చిరు కోరికను ఆమోదించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి మదన్ మోహన్, నిర్వాహక కార్యదర్శి ప్రసాదరావు పాల్గొన్నారు.

జ్యోతిబసుకు ఘన నివాళులు



ఖలీల్‌వాడి: మతోన్మాదానికి వ్యతిరేకంగా జీవితాంతం కృషి చేసిన వ్యక్తి జ్యోతి బసు అని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు పేర్కొన్నారు. మంగళవారం జ్యోతి బసు 12వ వర్ధంతి సందర్భంగా సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. రమేష్ బాబు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీ నిర్మాతల్లో ఒకరుగా ఉండి శ్రామిక వర్గ ఐక్యతకు ప్రజా సమస్యలపై నిరంతరం కృషి చేసిన వ్యక్తి జ్యోతి బసు అని కొనియాడారు. 35 ఏళ్ల పాటు నిరంతరాయంగా ఆయన పాలన కొనసాగించి ప్రభుత్వ మెప్పు పొందారని గుర్తు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శంకర్ గౌడ్, నేతలు గంగాధర్, గోవర్ధన్, కృష్ణ, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉపాధ్యాయ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ నాగరాజు



నగర మేయర్ చేతుల మీదుగా..

ఖలీల్‌వాడి: నగరంలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో బీసీ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను కమిషనర్ కేఆర్ నాగరాజు ఆవిష్కరించారు. అనంతరం సీపీ మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి రాఘవాపురం గోపాలకృష్ణ, గౌరవ అధ్యక్షులు కొట్టూరు రమేష్, ఉపాధ్యక్షులు మహేందర్, బీసీటీయూ మహిళా అధ్యక్షురాలు నునుగొండ విజయలక్ష్మి, డిచ్‌పల్లి మండలం అధ్యక్షులు కొట్టాల రామకష్ణ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ ఎంప్లాయీస్ అసోసియేషన్..

నిజామాబాద్‌నాగారం: విశ్వ బ్రాహ్మణ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్‌ను మంగళవారం నగర మేయర్ నీతూకిరణ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న సీపీ నాగరాజు

ఖలీల్‌వాడి: ఖమ్మం జిల్లా బోనకల్లులో ఈ నెల 12 నుంచి 14 వరకు జరిగిన 67వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో ఛాంపియన్‌గా నిలిచిన నిజామాబాద్ బాలుర జట్టును ద్వితీయ స్థానంలో నిలిచిన బాలికల జట్టు సభ్యులను మంగళవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కేఆర్ నాగరాజు అభినందించారు. జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలిపినందుకు క్రీడాకారులను, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘాన్ని అభినందించారు. సీపీ నాగరాజు మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగాల్లో చేరి ప్రజలకు సేవలు అందించాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షులు రంజిత్ సింగ్, ప్రధాన కార్యదర్శి శ్యామ్, కోశాధికారి రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు



సిరికొండ: వరి పంటలో చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు పాటించాలని మండల వ్యవసాయాధికారి వెంకటేష్ తెలిపారు. కొండూర్, పోతున్నూర్ గ్రామాల్లో వరి పొలాలను ఏవో మంగళవారం పరిశీలించారు. వరి పైరులో మొగి పురుగు, ఆకుముడత తెగులు గమనించినపుడు వరి నాటిన 20 రోజులలో ఎకరానికి కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు పది కిలోలు, కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8 కిలోలు, క్లోరాంతనిప్రోల్ 0.4 గుళికలు 4 కిలోలు ఒక ఎకరానికి వాడాలని ఏవో సూచించారు. వరిలో అగ్గితెగులు ఉన్నట్లయితే ట్రైసైక్లజోన్ 120 గ్రాములు ఒక ఎకరానికి లేదా ఐసోప్రినలైన్ 300 మి.లీ ఒక ఎకరానికి వాడాలని సూచించారు.

యువస్టార్ యూత్ నూతన కార్యవర్గం

డిచ్‌పల్లి: మా ఊరి అభివృద్ధే తమ లక్ష్యమని యువస్టార్ యూత్ నూతన కార్యవర్గ సభ్యులు అన్నారు. రాంపూర్‌లో మంగళవారం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండారి గణేష్, ఉపాధ్యక్షుడిగా శేరు నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా జంగం రాజేశ్వర్, సహాయ కార్యదర్శులుగా మోతె రాజేందర్, శేరు నరేష్, కోశాధికారిగా ఇరుమొల్ల శ్రీకాంత్, పాపాయి శ్రీను, ప్రత్యేక సలహాదారులుగా కుమ్మరి గంగాధర్, కుర్మా సురేష్, లచ్చమొల్ల రాజు, యాపచెట్టు మహేష్, కుర్మా మహేష్‌లను ఎన్నుకున్నారు.

అథ్లెటిక్స్‌లో జిల్లావాసికి బంగారు పతకం



బంగారు పతకంతో అజయ్, తదితరులు

నిజామాబాద్‌నాగారం: జాతీయ స్థాయి అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో మన జిల్లాకు చెందిన అజయ్ బంగారు పతకం సాధించారు. ఈ నెల 7 నుంచి 12వరకు చెన్నైలో జరిగిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల పరుగు పందెంలో అజయ్ చాంపియన్‌గా నిలిచాడు. సెప్టెంబర్‌లో జరిగే ఆసియా గేమ్స్‌లో అర్హత సాధించడానికి సిద్ధమవుతున్నాడు. నగరంలోని ఖానాపూర్ పరిధిలోని బ్యాగనగర్ కాలనీ చెందిన అజయ్ ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. జిల్లా నుంచి అథ్లెటిక్స్‌లో బంగారు పతకం కేవలం అజయ్ సాధించడంతో అథ్లెటిక్స్ క్రీడాకారులు, వైద్యులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఐఎంఏ జిల్లా కార్యదర్శి డాక్టర్ జలగం తిరుపతిరావు, డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ భూమారెడ్డి, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ పన్నూరి శ్రీనివాస్‌రావు ప్రత్యేకంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

వారాంతపు సంత ప్రారంభం



ఇందల్వాయి: ఇందల్వాయి–ధర్పల్లి రోడ్డు మార్గంలో ఎల్లారెడ్డిపల్లె భారతమాత విగ్రహం వద్ద వీడీసీ సభ్యులు, పంచాయతీ పాలక వర్గసభ్యులు ప్రజల సౌకర్యార్థం వారాంతపు సంతను ఏర్పాటు చేశారు. ప్రతీ మంగళవారం జరిగే ఈ వారాంతపు సంతను ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ మంగళవారం ప్రారంభించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులకు వారాంతపు సంత ఉపయోగకరంగా ఉంటుందని జగన్ అన్నారు. సర్పంచ్ గుర్రం నరేష్, ఎంపీపీ రమేష్ నాయక్, ఎంపీటీసీ బాపురావు, ఉప సర్పంచ్ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చెలివేరి దాసు, తదితరులు పాల్గొన్నారు.

అరెస్ట్ చేసే వరకు ఉద్యమం



ఖలీల్‌వాడి: కోటగిరి టీచర్ మల్లిఖార్జున్‌పై దాడికి పాల్పడిన వ్యక్తులను అరెస్ట్ చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం వహించడంపై ఐక్యకార్యచరణ కమిటీ సమావేశం నిర్వహించింది. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్టహౌజ్‌లో బహుజన, వామపక్ష, దళిత, ప్రజాసంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ చేసే వరకు ఉద్యమాలు ఉధృతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో సావెల్ గంగాధర్, సిద్ధిరాములు ఉన్నారు.

గాంధీనగర్‌లో దుర్గామాత పల్లకీ సేవ



పల్లకీలో ఊరేగిస్తున్న గ్రామస్తులు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం గాంధీనగర్‌లో మంగళవారం దుర్గామాత పల్లకి సేవ నిర్వహించారు. దుర్గామాత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో దుర్గామాత విగ్రహాన్ని పల్లకిలో ఉంచి ఊరేగించారు. పంటలు సంవృద్ధిగా పండాలని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనూష లక్ష్మణ్, ఆలయ కమిటీ చైర్మన్ ప్రకాష్, వైస్ చైర్మన్ శంకర్, గణపతి నాయక్, విఠల్, మానస, గోవింద్, బాబురావు, పూజారి, శంకర్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	15	క్యాప్సికం	30	50
బెండకాయ	60	80	గాజరుగడ్డ	25	30
బీరకాయ	60	80	పచ్చిమిర్చి	35	50
దొండకాయ	30	50	దోసకాయ	15	30
బీర్నిసుకాయ	25	40	ఆలుగడ్డ	20	35
కాకరకాయ	40	60	గోబిగడ్డ	10	20
వంకాయ	40	60	గోబిపువ్వు	20	30
పాలకూర	20	40	బీట్‌రూట్	20	40
మెంతికూర	30	50	గోరు చిక్కుడు	45	60
కొత్తిమీర	40	60	చిక్కుడుకాయ	40	60
పుదీనా	40	60			

- ఇందూరు

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
స్క్రీన్-1- వారసుడు -1.10,7.30
వీరసింహారెడ్డి - 4.20,10.40
స్క్రీన్-2-వీరసింహారెడ్డి - 10.10,1.20,7.40
వారసుడు-4.30 10.45
స్క్రీన్-3- వాల్తేరు వీరయ్య -10.30,1.30
4.30,7.30,10.30
పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్-1-వాల్తేరు వీరయ్య -9.30,12.50,4.10
7.30,10.50
స్క్రీన్-2-వారసుడు-9.30,3.30,7.00,10.30
కళ్యాణం...కమనీయం -1.00
స్క్రీన్-3-వీరసింహారెడ్డి -9.00,4.00,
7.30 11.00 -వారసుడు -12.30
స్క్రీన్-4- వాల్తేరు వీరయ్య -10.20
వీరసింహారెడ్డి -1.40
తెగింపు -5.10,10.50
కళ్యాణం...కమనీయం...-8.20
దేవి వీరసింహారెడి
నటరాజ్ తెగింపు
లలితామహల్ వాల్తేరు వీరయ్య
శ్రీదేవి ధమాకా
విజయ్ వారసుడు

కమ్మేసిన పొగమంచు



నగరంలోని హైదరాబాద్ రోడ్డులో లైట్లు వేసుకొని వస్తున్న వాహనదారులు

నిజామాబాద్ నగరం ఉదయం పొగమంచుతో కమ్ముకుంది. దీంతో వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణం సాగించారు. పొగమంచు ఉండడంతో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. సోమవారం కనిష్ట ఉష్ణోగ్రత 18.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్–నిజామాబాద్



ప్రగతినగర్ రోడ్డులో పరిస్థితి

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం. మధుసూధన్ (ACO) : 9951027699
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంబాబ్ : 7997958181
ఆర్మూర్ శివ : 9848956776 & బాల్కొండ ప్రశాంత్ : 8919850800
బోధన్ వి. మల్లిఖార్జున (ACM) : 70955 23222
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899